# కేటుకు

## వాణిశ్రీ

బసవరాజు హైదరాబాద్ వచ్చి చిన్ననాటి స్నేహితుడు పెద్దిరెడ్డిని కలుసుకుని వాళ్ళింట్లో రెండు రోజులు గడిపాడు. బసవరాజుని ఆటోలో బస్ స్టేషన్ వరకూ చేర్చి వీడ్కోలివ్వాలని పెద్దిరెడ్డి బయల్దేరాడు.

ఇద్దరూ నడుస్తున్నారు. ఆటో కనిపిస్తే ఆపి ఎక్కాలనుకున్నారు. ఫర్లాంగు దూరం నడిచినా ఆటో దొరక లేదు.

ఒక ఇంటి ముందు సడన్ బ్రేక్ వేసినట్లు ఆగిపోయాడు బసవరాజు. పెద్దిరెడ్డి తలెత్తి చూశాడు ఆ ఇంటి వైపు.

పెద్ద పెద్ద అక్షరాలతో నేమ్ బోర్డు కనిపించింది.

'ప్రమీలాదేవి—రచయిత్రి.'

బసవరాజు కాలింగ్ బెల్ నొక్కాడు.

తలుపులు తెరుచుకున్నాయి. పన్నెండేళ్ళ పిల్ల కనిపించింది.

"ఎవరు కావాలండీ?" అంది. పని పిల్ల కాబోలు.



"ప్రమీలాదేవిగారున్నారా?" అన్నాడు బసవరాజు.

"ఉన్నారండీ" అంది ఆ అమ్మాయి

"ఏం చేస్తున్నారు?"

"నవల రాస్తున్నారండీ" అందా అమ్మాయి.

"అలాగా! కొంచెం పిలుస్తావా?" అన్నాడు బసవరాజు.

"మీ పేరేమిటండీ?" ప్రశ్నించింది.

"నా పేరు బసవరాజు."

"లోపలి కొచ్చి కూర్చోండి" అంటూ ఫాన్ వేసి వెళ్ళిందా అమ్మాయి.

ఇద్దరూ సోఫాలో ఆసీనులయ్యారు.

"ఏరా! ఈవిడ నీకు తెలుసేమిటి?" అన్నాడు పెద్దిరెడ్డి కొంచెం ఆశ్చర్యపోతూ.

"ఉహూ... తెలీదు" అన్నాడు బసవరాజు.

"మరి?" నివ్వెరపోతూ ప్రశ్నించాడు పెద్దిరెడ్డి.

"పనుందిలే" అంటూ నవ్వాడు బసవరాజు.

ఇంతలో ప్రమీలాదేవి వచ్చింది.

"నమస్కారమండీ" అంది రెండు చేతులూ జోడించి నవ్వుతున్న ముఖంతో.

ఇద్దరూ నమస్కారం పెట్టారు.

ఆమె కూర్చుంది.

"నా పేరు బసవరాజు లెండి. కంట్రాక్టులు చేస్తుంటాను. ఈ మధ్య అందులో కొంచెం గొడవ లొస్తున్నాయి. సిమెంట్ అమ్ముకుంటున్నామనీ, ఇంజినీర్లతో లాలూచీ పడుతున్నామనీ ..."

బసవరాజు చెప్తున్న దేమిటో ఆమెకు అర్థం కావడం లేదు. కానీ 'ఊ' కొడుతూ వింటున్నది.

"అసలు సంగతేమిటంటే సినిమా తియ్యాలని అనుకుంటున్నాను. దానికి కథ కావాలి గదా. అందుకని వచ్చాను. మీరు చాలా నవలలు రాశారు అని ఇతుగో వీడు చెప్తే కలుసుకుందామని వచ్చాను" అన్నాడు బసవరాజు.

ఆమె ముఖం ట్యూబ్‌లైట్‌లా వెలిగిపోయింది.

"అలాగా! చాలా సంతోషం. వీరు..." అంది పెద్దిరెడ్డి వంక చూసి.

"వీడు ఇక్కడే ఉంటున్నాడు. ఈ పేటలోనే. మీకు పరిచయం లేదా? పేరు పెద్దిరెడ్డి. ఆరోక్లాసు నుంచి బి. ఎ. వరకు కలిసి చదువుకున్నాం. నేనేమో ఉద్యోగం దొరక్క కంట్రాక్టుల్లో పడ్డాను. వీడేమో వ్యాపారంలో పడిపోయాడు. బ్యాంక్ స్ట్రీట్‌లో ఎలక్ట్రికల్ షాపు ఉంది. మీకేమైనా ఎలక్ట్రికల్ గూడ్స్ కావాలంటే చెప్పండి 'ఏ' క్లాస్‌వి సప్లయ్ చేస్తాడు."

"ఇక ఆపరా బాబూ!" అని పెద్దిరెడ్డి అడ్డుపడ్డాడు.

"మీ ఇల్లెక్కడుండి?" అంది ఆమె పెద్దిరెడ్డి వంక చూసి.

అతను చెప్పాడు.

"అసలు కథలోకి వస్తాను. మీ కథలు ..." అన్నాడు బసవరాజు.

"చాలా ఉన్నాయండీ. పాతిక నవలలు పబ్లిష్ అయ్యాయి. రెండు సీరియల్స్‌గా వీక్లీస్‌లో వస్తున్నాయి. మరో రెండు తయారు చేస్తున్నాను. ఏదో లెండి ఇప్పుడిప్పుడే కృషి చేస్తున్నాను" అంది ఆమె.

"ఇప్పుడిప్పుడే ఏమిటి లెండి. మీ పేరు బ్రహ్మాండంగా మోగిపోతున్నదని పెద్దిరెడ్డి చెప్పాడు లెండి" అన్నాడు బసవరాజు.

పెద్దిరెడ్డి బిక్కమొహం వేసుకుని చూస్తున్నాడు. 'వీడి దుంపతెగ. వీడిన్ని అబద్ధాలాడుతున్నాడెందుకని? అసలీవిడ ముఖం కాదు గదా పేరుగూడా ఇప్పటివరకు తెలీదు' అనుకున్నాడు లోలోపల.

పనిపిల్ల కాఫీలు తెచ్చి టీపాయ్ మీద పెట్టింది.

"ఇప్పుడెందుకండీ?" అన్నాడు బసవరాజు.

"ఫరవాలేదు తీసుకోండి. మీరు తొలిసారిగా సినిమా తీస్తూ, తొలిసారిగా నా నవల కోసం రావడం నాకెంతో హేపీగా ఉందండీ" అంది ఆమె.

"మీ నవలలు నా కెక్కడ దొరుకుతాయి? అన్నీ చూసి మంచి సబ్జెక్ట్ సెలక్ట్ చేసుకుంటాను" అన్నాడు బసవరాజు.

"కాపీలన్నీ నా దగ్గరున్నాయి" అంటూ ఆమె అలమారా తెరిచి టీపాయ్ మీద రకానికొకటి తీసి పెట్టింది.

"అబ్బ! ఎంతెంత లావున్నాయండీ ఈ నవలలు! ఎంత ఓపికండీ మీకు? ఇన్నిన్ని పుస్తకాలు ఎలా రాస్తారో నాకు చచ్చినా అర్థం కాదు" అని తెగ మెచ్చుకున్నాడు బసవరాజు.

ఆమె పొగడ్తలకు పొంగిపోతూ "ఏదో లెండి. మా వారు అన్నట్లు అంతా భగవంతుడు ఇచ్చిన వరం" అంది.

"ఒరేయ్! బస్ వెళ్ళిపోతుందేమో? ఇక వెళ్దామా?" అని హెచ్చరించాడు పెద్దిరెడ్డి.

"అవునవును ... ఇక సెలవు తీసుకుంటామండీ" అంటూ ఆ నవలలు బ్యాగ్‌లో సర్దుకున్నాడు బసవరాజు.

"ప్రొడక్షన్ ఎప్పుడు మొదలు పెడుతున్నారు?" ఆత్రతతో ప్రశ్నించింది ఆమె.

"త్వరలోనే. అన్నట్లు అడగడమే మరిచిపోయాను. నవలకి సినిమా రైట్స్ ఎంతివ్వాలి?"

ఆమె మొగమాటపడుతూ "బసవరాజు గారూ! మీరు తొలిసారిగా సినిమా తీస్తున్నారు. నా నవలగూడా తొలిసారి తెరకెక్కుతోంది. మీ ఇష్టం. నేను చెప్పను" అంది.

"భలేవాడే!" అని పకపక నవ్వాడు బసవరాజు.

సెలవు తీసుకుని రోడ్డెక్కారు మిత్రులిద్దరూ. ఆటో రెడీగా ఉంది. ఎక్కి కూర్చున్నారు. ఆటో బయలుదేరింది.

"ఏరా కంట్రాక్టులు మానేసి సినిమా తీస్తున్నావా? నీకేం పొయ్యే కాలం వచ్చింది?" చివాట్లు వేశాడు పెద్దిరెడ్డి.

బసవరాజు నవ్వి "సినిమా తియ్యడానికి నేనేం తెలివి తక్కువ వాడి నేమిట్రా?" అన్నాడు.

పెద్దిరెడ్డి తెల్లబోయాడు.

"మరి ఆవిడ దగ్గర పొటకాయలు కొట్టావ్?"

"నవలలకోసం."

"ఆఁ..."

"అవున్రా? ఈమధ్య కొత్తరకం బిజినెస్ ఒకటి మొదలైంది. నవలలు అద్దెకివ్వడం. నా మేనల్లుడొకడు కొత్తగా ఒకటి మొదలు పెట్టాడు. వాడికి పనికొస్తాయి గదా అని ..." బసవరాజు నవ్వాడు.

"ఛీ ... పాపం ఆమెను మోసం చేశావు గదా? అసలు నీకీ సినిమా ఐడియా ఎట్లా వచ్చింది?"

"రచయితలకి సినిమా వీక్‌నెస్ ఉంటుందని ఎక్కడో చదివినట్లు గుర్తు ..."

బసవరాజు ముసిముసి నవ్వులు నవ్వుతుంటే 'ఇన్ని మోసాలు నేర్చుకోబట్టే గదా వాడిన్ని డబ్బులు సంపాదిస్తున్నాడు. ఇతరుల బలహీనతలు తెలుసుకోని, వాడుకోవడమే వీడి విజయంలో కిటుకులా ఉంది' అనుకున్నాడు పెద్దిరెడ్డి. ★



ఫోటో: శంఖం వీరయ్య